సాక్షి ఆదిలాబాద్

ఆదివారం । 21 । సెప్టెంబర్ । 2025

I

గరిష్టం/కనిష్టం
30.0/25.0

వాతావరణం
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.



ముందస్తు సంబరాలు

జిల్లా వ్యాప్తంగా ఆయా విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. విద్యార్థినులు, ఉపాధ్యాయినులు ఆడిపాడారు. IIIలో▸

పూలోత్సవం

- బతుకమ్మ సంబరాలకు వేళాయె..
- నేడు 'ఎంగిలిపూల'తో షురూ
- తొమ్మిది రోజులపాటు వేడుకలు
- ఊరూవాడా ఇక ఆటపాటలతో సందడి





ఎక్కడైనా దేవుణ్ని పూలతో పూజిస్తారు. అయితే ఆ పూలనే దైవంగా భావించి పూజించడం బతుకమ్మ పండుగ ప్రత్యేకత. తీరొక్క పూలు, ఉయ్యాల పాటలకు గాజుల చప్పట్లు తోడై నేటి నుంచి ఊరూవాడా సందడిగా మారనుంది. అంతటా తొమ్మిది రోజుల పాటు పూలోత్సవ సంబురం అంబరాన్నంటితే ఆదిలాబాద్‌లో మాత్రం పక్షం నుంచి 21 రోజుల పాటు బొడ్డెమ్మగా కొనసాగడం ప్రత్యేకం.

మంచిర్యాలటౌన్/దండేపల్లి/ఆసిఫాబాద్‌అర్బన్/చెన్నూర్: అడవిలో సహజసిద్ధంగా లభించే గునుగు, తంగేడు, చామంతి, జాజి, రుద్రాక్ష, కట్ల, గానుగ, బీర, గుమ్మడి, మందార పూలను సేకరించి ఇత్తడి తాంబాలంలో బతుకమ్మను పేరుస్తారు. ప్రకృతిని ఆరాధిస్తూ మహిళలు పాడే పాటలు బతుకు చిత్రాన్ని ప్రతిబింబిస్తాయి. బంగారం లాంటి జీవితాన్ని ప్రసాదించమని గౌరమ్మను కొలుస్తూ సాగే ఈ పండుగంటే ఆడబిడ్డలకు ఎనలేని మక్కువ. తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టే పూల పండుగ ఆదివారం భాద్రపద అమావాస్య(పెత్రామాస) ఎంగిలి పూలతో మొదలవుతుంది. తొమ్మిది రోజులపాటు కొనసాగుతుంది. రోజూ సాయంత్రం తీరొక్క పూలతో పేర్చిన బతుకమ్మలను ప్రధాన కూడళ్లలో ఒక్కచోట చేరుస్తారు. చప్పట్లు కొడుతూ పాటలు పాడుతూ వాటి చుట్టూ వలయాకారంగా తిరుగుతూ ఆడుతారు. ఈ నెల 29న సద్దులతో వేడుకలు ముగుస్తాయి. ప్రతీ రోజు బతుకమ్మ ఆడిన తర్వాత సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేసి నైవేద్యం ఇచ్చిపుచ్చుకుంటారు.

తీరొక్క పాటలు

'బతుకమ్మ.. బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో...', 'రామ రామ రామ ఉయ్యాలో.. రాముడే శ్రీరామ ఉయ్యాలా!, 'ఏమేమి పువ్వొప్పునే గౌరమ్మా... ఏమేమి కాయప్పునే గౌరమ్మా... తంగేడు పువ్వొప్పునే... గౌరమ్మ, తంగేడు కాయప్పునే... గౌరమ్మ..' అంటూ తీరొక్క పాటలతో ఊరూవాడా మారుమోగుతుంది. ఆడపడుచులు 'ఉయ్యాల' పాటలతో ఇక్కడి సంస్కృతీ సంప్రదాయాలను కీర్తిస్తూ ఆడుతూ పాడుతుంటారు. ఆడిపాడే బతుకమ్మ సంబురాలు జానపద సంబంధ వేడుక మాదిరి కనిపించినా ఇందులో దేవతల స్మరణతోపాటు ప్రకృతిని ఆరాధించే గొప్ప మానవీయ కోణాలు ఇమిడి ఉన్నాయి.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ. తెలంగాణ అస్తిత్వం బతుకమ్మలోనే ఉంది. ఈ నేలపై బతుకమ్మ పండుగను శతాబ్దాలుగా జరుపుకొంటున్నారు. ఈ సంప్రదాయం ఎలా మొదలైందో చెప్పడానికి ఎన్నో కథలు ప్రచారంలో ఉన్నాయి. నవాబులు, భూస్వాముల పెత్తందారీతనంలో నలిగిపోయిన గ్రామీణ మహిళల బతుకులు దుర్భరంగా ఉండేవి. వారి ఆకృత్యాలకు నలిగిపోయిన వారిని, తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్న వారిని తలచుకుని తోటి మహిళలు విచారించేవారు. వారికి ప్రతీకగా పూలను పేర్చి బతుకమ్మా లేదా బతుకు అమ్మా అంటూ దీవిస్తూ పాటలు పాడేవారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. పాటల వెనుక ఉండే మర్మం ఇదే..

తొమ్మిది రోజులు.. రోజుకో నైవేద్యం

- తొమ్మిది రోజులపాటు మహిళలు బతుకమ్మను పేర్చుతారు. రోజుకో రకం నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.
- తొలిరోజు ఎంగిలి పూల బతుకమ్మగా కొలుస్తారు. నువ్వులు, బియ్యంపిండితో కూడిన నైవేద్యం సమర్పిస్తారు.
- రెండో రోజు అటుకుల బతుకమ్మ.. పప్పు, బెల్లం, అటుకులతో నైవేద్య తయారు చేస్తారు.
- మూడో రోజు ముద్దపప్పు బతుకమ్మగా పూజిస్తారు. ముద్దపప్పు, పాలు, సత్తుపిండి, చక్కెర, పెసలుతో నైవేద్యం తయారు చేసి సమర్పిస్తారు.
- నాలుగో రోజు నాన బియ్యం బతుకమ్మగా కొలుస్తారు. నానబెట్టిన బియ్యం, పాలు, బెల్లం కలిపి నైవేద్యం సమర్పిస్తారు.
- ఐదోరోజు అట్ల బతుకమ్మ.. అట్లు, లేదా దోశలు అమ్మవారికి నైవేద్యంగా సమర్పిస్తారు.
- ఆరో రోజు అలిగిన బతుకమ్మ.. ఆశ్వీయుజ పంచమి రోజు అమ్మవారు అలకలో ఉంటారు. అందుకని ఈ రోజు బతుకమ్మ పేర్చరు. నైవేద్యం సమర్పించరు.
- ఏడో రోజు వేపకాయల బతుకమ్మగా పూజిస్తా రు. బియ్యం పిండిని బాగా వేయించి వేపకాయ లుగా తయారు చేసి నైవేద్యంగా సమర్పిస్తారు.
- ఎనిమిదో రోజు వెన్నముద్దల బతుకమ్మ.. వెన్నతో నువ్వులు కలిపి ఉండలుగా తయారు చేస్తారు. లేదంటే నెయ్యి, బెల్లం కలిపి నైవేద్యంగా సమర్పిస్తారు.
- తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ.. దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తారు. ఐదు రకాలు పెరుగన్నం, చింతపండు పులిహోర, లెమన్‌రైస్, కొబ్బరన్నం, నువ్వులన్నం నైవేద్యాలు తయారు చేసి సమర్పిస్తారు. 'పోయిరా బతుకమ్మ.. వెళ్లి రావమ్మ.. మళ్లొచ్చే యాడాదికి తిరిగి రావమ్మా' అని వీడ్కోలు పలుకుతారు.

కష్టాన్ని మర్చిపోతాం..



బొడ్డెమ్మ పండుగప్పుడే పత్తి పంట చేతికి వస్తది. ఏరడం ప్రారంభమైతది. పొద్దు నిండా చేన్ల పనిచేసి, ఇంటికొచ్చిన తర్వాత అలసటగా ఉంటది. అయితే బొడ్డెమ్మ పండుగ షురూ కాగానే ప్రతిరోజు గద్దె దగ్గరికి వెళ్లి బతుకమ్మను పెట్టి పూజించి ఆడిపడితే కష్టాన్నంతా మర్చిపోతాం. కష్టసుఖాలు తెలుపుకునేందుకు, అనుబంధాలు బలపడేందుకు ఈ పండుగ ఓ ప్రత్యేకం. **– దాసరి రుక్మిణి, పిప్పల్‌కోటి, ఆదిలాబాద్ జిల్లా**

కలిసికట్టుగా జరుపుకుంటాం..



బతుకమ్మ వేడుకలను మా కాలనీలో వైభవంగా జరుపుకుంటాం. సాధారణ రోజుల్లో ఎవరి పనుల్లో వాళ్లు బిజీగా ఉంటాం. పండుగ సమయంలో మాత్రం అందరం ఒకే చోట చేరుతాం. మొదట్లో బతుకమ్మ పాటలు వచ్చేవి కాదు. ప్రస్తుతం చాలా పాడగలుగుతున్నాను.

– సూచిక పవార్, రవీంద్ర నగర్, ఆదిలాబాద్

బతుకమ్మ @ బొడ్డెమ్మగా

- ఆదిలాబాద్‌లో ప్రత్యేకం
- గద్దెలు కట్టి.. పూలను పూజించే ఆనవాయితీ



బొడ్డెమ్మ గుంత (ఫైల్)

ఆదిలాబాద్: నేడు ఎంగిలిపూలతో రాష్ట్రవ్యాప్తంగా బతుకమ్మ సంబరాలు షురూ కానున్నాయి. అయితే జిల్లాలో మాత్రం ఈ పండుగ కొంత భిన్నంగా కనిపిస్తోంది. 15 నుంచి 21 రోజులపాటు బొడ్డెమ్మగా వ్యవహరిస్తూ వేడుకలు నిర్వహించుకోవడం ఆనవాయితీ.

గద్దెలు కట్టి.. వెంపలి పెట్టి

జిల్లాలో మహాలయ అమావాస్య రోజు మహిళలు నిర్ణయించుకున్న ఒక స్థలంలో గుంతను తవ్వుతారు. అందులోని మట్టిని తీసి చుట్టూ 16 నుంచి 21 గద్దెలు ఏర్పాటు చేస్తారు. అనంతరం ఆడపడుచులు మంగళ హారతులతో వెళ్లి స్థానికంగా ఉండే వెంపలి చెట్టుకు పూజలు చేసి దానిని తీసుకొని వచ్చి గుంత మధ్యలో ఏర్పాటు చేస్తారు. అలాగే ప్రతి ఇంటి నుంచి ఓ పళ్లెంలో పూలను బతుకమ్మగా చేసి తీసుకువస్తారు. వాటిని గద్దెల వద్ద ఉంచుతారు. గునుగు, గుమ్మడి, తంగేడు, బంతి తదితర పూలతో తీర్చిదిద్దుతారు. అటుకులు, పేలాలు, పల్లీలు, పుట్నాలు, బెల్లం, చక్కెర వంటి వాటిని నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం బతుకమ్మ పాటలతో లయబద్ధంగా నర్తిస్తూ, తమ కష్ట సుఖాలను తెలుపుకుంటారు. అనంతరం ఆ పూలను ఆ గుంతలోనే వేసి, అర్ధరాత్రి వరకు ఆడి పాడుతారు.

ఆడపడుచుగా భావించి..

బతకమ్మను స్థానికంగా మహిళలు బొడ్డెమ్మగా పిలుస్తుంటారు. అలాగే ఆడపడుచుగా భావిస్తారు. అమావాస్య రోజున మంగళహారతులతో ఆహ్వానిస్తూ వేడుకలను ప్రారంభిస్తారు. పక్షం నుంచి 21 రోజులపాటు బొడ్డెమ్మపై పసుపుతో గౌరమ్మని పెట్టి పూజలు చేస్తారు. చివరి రోజున అత్తవారింటికి పంపుతున్నట్టుగా భావించి వెళ్లిరా బతుకమ్మ అంటూ గంగమ్మ ఒడికి చేర్చుతారు. దసరా రోజు చిన్న సద్దులు, చివరి రోజు పెద్ద సద్దులుగా వ్యవహరిస్తారు. నిమజ్జనం రోజున ఆ గౌరమ్మను తీసుకొని పూసుకుంటారు. అనంతరం సద్దులను వాయినాలుగా ఇచ్చిపుచ్చుకుంటారు.

చంద్రుడిని చూశాకే.. నిమజ్జన ఘట్టం

అమావాస్య రోజున ప్రారంభమయ్యే వేడుకలు అశ్వయుజ బహుళ పాఢ్యమికి ముందు వచ్చే పౌర్ణమి(భోజగిరి పున్నమి) రోజున పాలలో చంద్రుడిని చూసిన తర్వాత నిమజ్జనం చేస్తుంటారు. ఆడపడుచులు తమ ఇంటి నుంచి తీసుకువచ్చిన పాలను రాగి, ఇత్తడి, వెండి పాత్రల్లో పోస్తారు. అర్ధరాత్రి చంద్రుడు పాలలో నిట్ట నిలువుగా కనిపించే వరకు ఆడిపాడుతారు. అనంతరం ఆ పాలను ప్రసాదంగా స్వీకరిస్తారు. పౌర్ణమి తరువాత మరో వారం పాటు నిమజ్జనం తంతు కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

మావల తహసీల్దార్ కార్యాలయం మార్పు

సాక్షి స్పందన

కైలాస్‌నగర్: శిథిలావస్థకు చేరిన మావల తహసీల్దార్ కార్యాలయ దుస్థితిని వివరిస్తూ 'కూలేందుకు సిద్ధం' శీర్షికన ఈనెల 18న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు కలెక్టర్ రాజర్షి షా స్పందించారు. కార్యాలయం కోసం కైలాస్‌నగర్‌లో గల ఆదిలాబాద్ ఆర్డీవో క్వార్టర్స్‌ను కేటాయించారు. శనివారం నూతన భవనంలోకి మార్చినట్లుగా తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. మండల వాసులు ఈ మార్పును గమనించాలని ఆయన కోరారు.

కనీస వేతనం చెల్లించాలి

ఆదిలాబాద్‌టౌన్: వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ కార్మికులకు రూ.26 వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలోని మాధవరావు విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ యునైటెడ్ మెడికల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (రిమ్స్ బ్రాంచ్) 5వ మహాసభలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంట్రాక్ట్ కార్మికులపై ప్రభుత్వాలు, అధికారులు వ్యవహరిస్తున్న తీరును వివరించారు. ఉద్యమాలతోనే హక్కుల సాధన సాధ్యపడుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశ్, సురేందర్, ఖలీల్ పాల్గొన్నారు.

భోరజ్ జంక్షన్ వద్ద వీయూపీ

కైలాస్‌నగర్: జిల్లాలోని భోరజ్ జంక్షన్ వద్ద వెహికల్ అండర్ పాస్(వీయూపీ) నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. హైదరాబాద్ నుంచి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్‌లపై జిల్లా కలెక్టర్లు, అటవీశాఖ అధికారులతో శనివారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆదిలాబాద్ నుంచి బేల వరకు చేపట్టిన జాతీయ రహదారి (ఎన్‌హెచ్ 353బి)లో భాగంగా ఈ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ట్రైనీ కలెక్టర్ సలోని, ఆర్డీవో స్రవంతి, నేషనల్ హైవే అథారిటీ డీఈ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- కలెక్టర్ రాజర్షి షా
- జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కైలాస్‌నగర్: ఇంటర్మీడియెట్‌లో వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, సాంఘిక సంక్షేమ, గురుకుల, మోడల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వారం వారం స్లిప్ టెస్టులు నిర్వహిస్తూ, విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగా బోధన చేపట్టాలన్నారు. అలాగే యుడైస్, అపార్ నంబర్లను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లైంగిక వేధింపుల నివారణకే పోక్సో చట్టం

ఆదిలాబాద్‌టౌన్: బాలికలపై లైంగిక వేధింపుల నివారణకు పోక్సో చట్టం రూపొందించబడిందని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో శనివారం పోక్సో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. లైంగిక వేధింపుల నిరోధానికి కమిటీలను ఏర్పాటుచేసి తరచూ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందులో జిల్లా అదనపు జడ్జిశివరాం ప్రసాద్, జిల్లా సంక్షేమాధికారి మిల్కా, యూని సెఫ్ ప్రతినిధి డేవిడ్, ట్రస్మా జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పవన్‌రావు, వి.ఆదినాథ్, దేవేందర్ పటాస్కర్, పురుషోత్తంరెడ్డి, అశోక్, సదాశివ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల గోదాం తనిఖీ

కైలాస్‌నగర్: జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో గల ఈవీఎంలు భద్రపర్చిన గోదాంను కలెక్టర్ రాజర్షి షా శనివారం సందర్శించారు. త్రైమాసిక తనిఖీలో భాగంగా వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి స్ట్రాంగ్‌రూంను తెరిపించారు. ఈవీఎంల పరిస్థితిని పరిశీలించారు. భద్రత సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పంచపూల ఉన్నారు.

ఇంటిబాటలో విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని ఓ వసతిగృహం నుంచి తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న విద్యార్థులు

జిల్లాలోని ఆయా సంక్షేమ వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు. ఆదివారం నుంచి దసరా సెలవులు షురూ కానున్నాయి. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, బంధువులు శనివారమే చేరుకుని తమ పిల్లలను తీసుకెళ్లారు. దీంతో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ కిటకిటలాడింది. – ఆదిలాబాద్‌టౌన్

బరితెగింపు!

- జిల్లాలో ఓ ముగ్గురు అక్రమార్కులు ఏకంగా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో గల రెడ్‌క్రాస్ సొసైటీకి సంబంధించిన స్థలాన్ని కాజేసేందుకు నకిలీ పత్రాన్ని సృష్టించారు. తాంసి మండలం పొన్నారికి చెందిన వ్యక్తితో పాటు జిల్లా కేంద్రానికి చెందిన మరో ఇద్దరు ఈ ఘటనకు పాల్పడ్డారు. ప్రభుత్వ భూమిని కాజేసేందుకు యత్నించారు. మున్సిపల్, రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో తప్పుడు పత్రాలు సమర్పించారు. రెవెన్యూ అధికారులు గుర్తించడంతో ఈ బాగోతం బయటపడింది. ఏకంగా కలెక్టర్ సంతకాన్నే ఫోర్జరీ చేశారంటే అక్రమార్కుల బరితెగింపు అర్థం చేసుకోవచ్చు.

- ఫోర్జరీ సంతకాలతో ప్రభుత్వ ఆస్తులు అన్యాక్రాంతం
- భూ కబ్జాలు, ఉద్యోగాల పేరిట మోసాలు
- వెలుగులోకి వస్తున్న ఘటనలు
- అక్రమార్కుల ఆట కట్టిస్తున్న జిల్లా పోలీసులు



ఆదిలాబాద్ శాంతినగర్‌లోని తండ్రి కొడుకులు తయారుచేసిన ఫేక్ డాక్యుమెంట్లు(ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో ఫోర్జరీ కేసులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ ఖాళీస్థలాలను హస్తగతం చేసుకోవడం.. ఖాళీగా ఉన్న జాగాలో పాగా వేయ డం.. వ్యవసాయ భూములను కబ్జా చేసేందుకు బరితెగించడం.. నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల పేరిట టోకరా వేసి నకిలీ పత్రాలు సృష్టించడం వంటివి చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో తండ్రీ కొడుకులు ఏకంగా ప్రభుత్వ కార్యాలయాల స్టాంపులు తయారీతో పాటు నకిలీ డాక్యుమెంట్లను సృష్టిస్తున్నారు. ఏ పత్రాన్నైనా ఫోర్జరీ చేయడంలో సిద్ధహస్తులు. ఇటీవలే వారు పోలీసులకు చిక్కారు. అక్రమార్కులు ఫోర్జరీలకు పాల్పడుతూ కాసుల కోసం ఎంతకైనా తెగిస్తున్నారు. జిల్లాలో ఇటీవల వెలుగుచూసిన ఘటనల నేపథ్యంలో పోలీసు యంత్రాంగం ప్రత్యేక నిఘా పెట్టింది. గతంలో ఇవి సివిల్ కేసులుగా ఉండడంతో తమను ఎవరు ఏమి చేయలేరనే ధీమాతో ఉన్నారు. ఎస్పీ అఖిల్ మహాజన్ బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల వ్యవధిలో కొరడా ఝళిపించగా.. వారి బండారం బయటపడుతుంది.కేసులు నమోదు చేసి జైలుకు పంపుతుండంతో బాధితులు ముందుకొస్తున్నారు. వారు ఎంతటి వారైనా పోలీసులు మాత్రం వదిలిపెట్టడం లేదు.

నకిలీ పత్రాలు సృష్టిస్తూ..

జిల్లాలో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ, అసైన్డ్ భూములు, ఖాళీగా ఉన్న ప్లాట్లు ఎక్కడెక్కడ ఉన్నాయో తెలుసుకొని ఆయా శాఖల్లో కొంత మంది అధికారులు, ఉద్యోగుల అండదండలతో ఫోర్జరీతో నకిలీపత్రాలు సృష్టిస్తున్నారు. పంచాయతీ, మున్సిపాలిటీల్లో అక్రమ మార్గంలో ముటేషన్, అసిస్మెంట్ చేయించుకుంటున్నారు.ఆ తర్వా త ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేయించి తీరా తమ పేరిట మార్చుకోవడం, అమాయకులకు ఆ భూ ములను విక్రయించడం పరిపాటిగామారింది. ఇటీవల బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న పోలీసు అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు. కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

ఎవరైనా ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు సృష్టించినా, తప్పుడు రిజిస్ట్రేషన్లు చేసినా కఠిన చర్యలు తప్పవు. నిబంధనలకు విరుద్ధంగా చిట్టీల దందా, అలాగే ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను మోసం చేస్తే కేసులు నమోదు చేస్తాం. బాధితులు పోలీసులను ఆశ్రయిస్తే న్యాయం జరిగేలా చూస్తాం.

– ఎల్.జీవన్‌రెడ్డి, ఆదిలాబాద్ డీఎస్పీ

ఆరు నెలల్లో జరిగిన సంఘటనలు..

- తలమడుగు మండలం కొత్తూర్ గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని కారోబార్ ఫోర్జరీ చేశాడు. ఆయనతో పాటు 17మంది నిందితులు అక్రమాలకు పాల్పడ్డారు. నకిలీ గృహ పత్రాలు, పన్ను రశీదులు, బెయిల్ కోసం ప్రాపర్టీ షూరిటీలు ఇచ్చి దొరికిపోయారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని గంజ్‌రోడ్‌లో ఓ భవనాన్ని నలుగురు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి కాజేసేందుకు యత్నించారు. బాధితుడి ఫిర్యాదుతో వారిపై టూటౌన్‌లో కేసు నమోదైంది.
- ఇచ్చోడ మండలంలోని అడెగాం(బి)లో ఓటర్ల ప్రమేయం లేకుండా ఓట్లను బదిలీ చేశారు. ఫోర్జరీ పత్రాలు సమర్పించడంతో నలుగురిని అరెస్టు చేశారు. వీరిలో ఇచ్చోడ ఆర్‌ఐను నిందితుడిగా చేర్చారు.
- ఆదిలాబాద్ పట్టణానికి చెందిన ఇద్దరు ప్రభుత్వ ఉద్యోగులు నకిలీ పత్రాలు సృష్టించి ప్లాట్ విక్రయించారు. వీరిపై వన్‌టౌన్‌లో కేసు నమోదైంది. వారిని అరెస్టు చేశారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు సంబంధించిన ప్రభుత్వ రోడ్డును నకిలీ పత్రాలు సృష్టించి కబ్జా చేసిన నలుగురిపై వన్‌టౌన్‌లో కేసు నమోదు చేశారు. తర్వాత కబ్జాను తొలగించి రోడ్డుపై రాకపోకలను పునరుద్ధరించారు.
- మావల స్టేషన్ పరిధిలో నకిలీ పత్రాలు సృష్టించిన తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఖానాపూర్‌లో కబ్జా చేసి బెదిరింపులకు పాల్పడిన వారిపై కొరడా ఝళిపించారు.
- ఆదిలాబాద్‌రూరల్ స్టేషన్ పరిధిలో రియల్ ఎస్టేట్ దందాలో నకిలీ పత్రాలు సృష్టించిన మహిళపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ఇచ్చోడ స్టేషన్ పరిధిలో నకిలీ ఆధార్, నివాస ధ్రువ పత్రాలు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగ పత్రాలు తయారు చేసిన 12 మంది నిందితులపై కేసు నమోదు చేశారు.

ఆస్పత్రుల అభివృద్ధికి కృషి చేయాలి



మంత్రిని కలిసిన గజేందర్, తదితరులు

నేరడిగొండ: బోథ్ నియోజకవర్గంలోని ప్రభుత్వ ఆస్పత్రుల అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ కోరారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహాను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

జెడ్పీ సీఈవోగా రాథోడ్ రవీందర్?

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ జెడ్పీ ఇన్‌చార్జి సీఈవోగా డీఆర్డీవో రాథోడ్ రవీందర్‌ను నియమించినట్లు తెలిసింది. ఇది వరకు పనిచేసిన జితేందర్‌రెడ్డి రాష్ట్ర ఆయిల్‌ఫెడ్ ఎండీగా బదిలీ కావడంతో ఆయన శనివారం విధుల నుంచి రిలీవ్ అయ్యారు. కాగా, ఆ శాఖ నుంచి అందిన ప్రతిపాదనల మేరకు కలెక్టర్ డీఆర్డీవోకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. సోమవారం ఆయన తన బాధ్యతలు స్వీకరించే అవకాశముందని కార్యాలయ వర్గాలు తెలిపాయి.

క్లుప్తంగా

కలప డిపో సీజ్



సీజ్‌చేస్తున్న రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు

భీమారం: మండల కేంద్రంలోని రాజలింగు కుటుంబానికి చెందిన ప్రైవేట్ కలప డిపోను మంచిర్యాల అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ రత్నాకర్‌రావు శనివారం సీజ్ చేశారు. ఇప్పటికే కలప వర్క్‌షాప్‌ని సీజ్ చేసిన అధికారులు తాజాగా డిపోను మూసివేశారు. ఇటీవల రిజర్వు ఫారెస్ట్‌లో చింతల ప్రదీప్, మగ్గిడి జీవన్, చింతల రాజ్‌కుమార్‌లు 21 టేకు చెట్లు నరికి స్మగ్లింగ్ చేస్తుండగా సిబ్బంది పట్టుకున్నారు. ఆ టేకు దుంగలను రాజలింగుకి అమ్ముతున్నట్లు నేరం అంగీకరించారు. వాటి విలువ రూ.86,426 వేలు ఉంటుందని, ఈమేరకు కేసు నమోదు చేసినట్లు రేంజ్ ఆఫీసర్ తెలిపారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న వ్యక్తిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్: అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పట్టణంలోని సుభాష్‌నగర్‌కు చెందిన షేక్ ఇమామ్ ఆదిలాబాద్ రూరల్ మండలంలోని తిప్ప నుంచి సుభాష్‌నగర్‌కు వాహనంలో మూడు ఆవులు, ఒక లేగదూడను తరలిస్తున్నారు. పక్కా సమాచారంతో వాహనాన్ని పట్టుకుని మూగజీవాలను గుడిహత్నూర్‌లోని గోశాలకు తరలించినట్లు పేర్కొన్నారు.

మద్యం అక్రమ రవాణాపై నిఘా

మంచిర్యాలక్రైం: మద్యం అక్రమ రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య ఓ ప్రకటనలో తెలిపారు. గంజాయి, గుడుంబా అరికట్టేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గతేడాది నవంబర్ నుంచి ఇప్పటివరకు చేపట్టిన తనిఖీల్లో 40 గుడుంబా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. 38 మందిపై చర్యలు తీసుకున్నామని వివరించారు. మరో 44 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తరలిస్తున్న 12 వాహనాలు సీజ్ చేశామని వివరించారు.

ఎస్బీఐ-2లో గోల్డ్‌లోన్ వివరాల సేకరణ

చెన్నూర్: చెన్నూర్ ఎస్బీఐ-2లో గతనెల 23న నగదు, బంగారు ఆభరణాలు, ఆపహరణకు గురైన విషయం తెలిసిందే. పోలీసులు అనతి కాలంలో బంగారు ఆభరణాలను రికవరీ చేసి బ్యాంక్‌లో భద్రపర్చారు. కోర్టు ద్వారా బాధితులకు వాటిని అప్పగించనున్నారు. ఈ ప్రక్రియలో భాగంగా రెండు రోజుల నుంచి బాధితులు ఎంత బంగారు ఆభరణాలు తనఖా పెట్టి రుణాలు పొందారనే వివరాలు సేకరిస్తున్నారు. గోల్డ్‌లోన్ బాధితులు 402 మంది ఉండడంతో వివరాల సేకరణ మరో వారంపాటు కొనసాగుతుందని సీఐ దేవేందర్‌రావు తెలిపారు.

అందరూ అమ్మవారిని దర్శించుకునేలా..

- శరన్నవరాత్రి ఉత్సవాలకు బాసరలో పటిష్ట ఏర్పాట్లు
- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు
- గోదావరి స్నానఘట్టాల వద్ద ప్రత్యేక సదుపాయాలు
- పారిశుద్ధ్య నిర్వహణకు అదనపు సిబ్బంది
- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆలయ ఈవో అంజనీదేవి



అంజనీదేవి, బాసర ఆలయ ఈవో

భైంసా: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా బాసర జ్ఞాన సరస్వతీదేవి దర్శనానికి వచ్చే భక్తులందరూ ఎలాంటి ఇబ్బంది లేకుండా అమ్మవారిని దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామని ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఈవో అంజనీదేవి తెలిపారు. కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశాల మేరకు సమన్వయంగా ముందుకెళ్తున్నామన్నారు. ఉత్సవాలను విజయవంతం చేయడంపై దృష్టి పెట్టామని పేర్కొన్నారు. సామాన్య భక్తులకు ఇబ్బందులులేకుండా చూస్తామన్నారు. శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏర్పాట్ల వివరాలు వెల్లడించారు.

సాక్షి : నవరాత్రి ఉత్సవాలు ఎప్పుడు ప్రారంభమవుతున్నాయి ?

అంజనీదేవి : ఈనెల 22 నుంచి అక్టోబర్ 2 వరకు బాసరలో నవరాత్రి ఉత్సవాలు జరుగనున్నాయి. కలెక్టర్ అభిలాష అభినవ్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు బాసర ఉత్సవాలపై ప్రత్యేక దృష్టి సారించారు. ఆలయంలో ఇప్పటికే ఏర్పాట్లు చేశాం. బాసర ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నాం. ప్రధాన గోపురాలు, ఆలయ ప్రాంగణం విద్యుత్ దీపాలతో అలంకరిస్తున్నాం. ఆలయాన్ని పూలతో అలంకరించి రోజువారీ ఉత్సవాలు నిర్వహిస్తాం.

సాక్షి : ఉత్సవాలకు వచ్చే ప్రముఖులు ఎవరు?

అంజనీదేవి : బాసర నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో వస్తారని భావిస్తున్నాం. ఇక ఆలయం తరపున దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల తోపాటు రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ పెద్దలను ఆహ్వానించాం. బస్సు, రైలు మార్గాల ద్వారా వచ్చే భక్తులు నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రశాంతంగా తిరిగి వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

సాక్షి : : అమ్మవారికి పూజలు, నిత్య అలంకరణ ఎలా ఉంటాయి?

అంజనీదేవి : దసరా నవరాత్రి ఉత్సవాల్లో సరస్వతీ అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 22న శైలపుత్రిగా, 23న బ్రహ్మచారిణిగా, 24న చంద్రఘంట అలంకరణలో, 25న కుష్మాండ అలంకరణలో, 26న స్కందమాతగా, 27న కాత్యాయనిగా, 28న కాళరాత్రి అలంకరణలో, 29న మహాగౌరీ అలంకరణలో, 30న సిద్ధిదాత్రిగా, అక్టోబర్ 1న మహాసరస్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిస్తారు. భక్తులు రూ.1000 చెల్లించి రసీదు పొందితే వారి గోత్ర నామాలతో విశేష అర్చన చేసి అమ్మవారి మహాప్రసాదం అందిస్తాం.

సాక్షి : ప్రసాదాల విషయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు ?

అంజనీదేవి : బాసర ఆలయానికి వచ్చే భక్తులకు ప్రసాదాల కొరతలేకుండా చూస్తాం. వచ్చే భక్తులకు ఎప్పటిలాగే లడ్డూ, పులిహోర ప్రసాదాలు అందుబాటులో ఉంటాయి. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి ప్రసాదాలను భక్తులకు విక్రయించే ఏర్పాట్లు చేస్తున్నాం.

సాక్షి : గోదావరి నది వద్ద ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అంజనీదేవి : ఈయేడు గోదావరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. గంగమ్మ తల్లి నిండుగా కనిపిస్తోంది. వచ్చే భక్తులంతా పుణ్యస్నానాలు ఆచరిస్తారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా నదిలో రోప్ కట్టి రక్షణ ఏర్పాటు చేస్తున్నాం. 20 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుతాం. నది వద్ద హెచ్చరికలు జారీ చేస్తు భక్తులను కనిపెట్టేలా నిఘా పెంచుతాం.

సాక్షి : పారిశుద్ధ్య నిర్వాహణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు ?

అంజనీదేవి : భక్తుల సంఖ్య పెరిగితే తాత్కాలికంగా సేవలు అందించే రోజువారీ కూలీలను పెంచుతాం. పారిశుద్ధ్య నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. ఉత్సవాల నేపథ్యంలో వచ్చే భక్తుల కోసం మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. గోదావరిఘాట్‌లో మొబైల్ టాయిలెట్లు అందుబాటులో ఉంటాయి. ఎప్పటికప్పుడు శుభ్రత నియమాలు పాటించి తీరుతాం.

రేపటి నుంచి శారదీయ శరన్నవరాత్రి వేడుకలు

- ఈవో అంజనీదేవి

బాసర: బాసర శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో సోమవారం నుంచి శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో అంజనీదేవి తెలిపారు. శనివారం వివరాలు వెల్లడించారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించినట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. వేడుకల్లో భాగంగా వైదిక బృందం ఆధ్వర్యంలో ఆలయంలో మొదటిసారిగా లోక కల్యాణార్థం శ్రీచక్రం నవర్ణవ అర్చన పూజలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్‌పాటక్ పాల్గొన్నారు.



కుటుంబ కలహాలతో భార్య హత్య

- గొడ్డలితో దాడి చేసిన భర్త
- నారాయణపూర్‌లో ఘటన



స్రవంతి (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏఎస్పీ, సీఐ, ఎస్సై

రెబ్బెన: కుటుంబ కలహాలతో భార్యను హత్య చేసిన ఘటన మండలంలోని నారాయణపూర్‌లో చోటుచేసుకుంది. రెబ్బెన సీఐ సంజయ్ కథనం ప్రకారం.. నారాయణపూర్ గ్రామానికి చెందిన గజ్జల తిరుపతి, మంచిర్యాల జిల్లా బూదకలాన్‌కు చెందిన స్రవంతి (38) దంపతులు. వీరికి ఇద్దరు సంతానం. తిరుపతి వ్యవసాయ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిచేస్తున్నాడు. కొన్నాళ్లపాటు వీరి కాపురం సజావుగా సాగింది. గత కొంతకాలంగా తిరుపతి మద్యానికి బానిసయ్యాడు. తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈక్రమంలో భార్యను ఎలాగైన హత్యచేయాలని నిర్ణయించుకున్నాడు. శనివారం తెల్లవారుజామున ఇంటి పనుల్లో నిమగ్నమై ఉన్న స్రవంతి మెడ, గొంతుపై గొడ్డలితో దాడి చేశాడు. తీవ్ర గాయాలై అక్కడిక్కక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న ఎస్సై వెంకటకృష్ణ, సీఐ సంజయ్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. హత్య జరిగిన తీరును, అందుకు గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ చిత్తరంజన్ ఘటన స్థలాన్ని సందర్శించి మృతదేహాన్ని పరిశీలించారు. మృతురాలి తమ్ముడు టేకుమట్ల సంజయ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

23న దసరా అడ్వాన్స్ చెల్లింపు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఈనెల 23న రూ.25 వేలు దసరా అడ్వాన్స్ కింద చెల్లించనున్నారు. ఈమేరకు శనివారం యాజమాన్యం ఉత్తర్వులు జారీచేసింది. అడ్వాన్స్ డబ్బులు కార్మికుల వేతనాల ఖాతాలో జమకానున్నాయి. పర్మినెంట్ కాని బదిలీ వర్కర్లకు రూ.12,500 చెల్లించనున్నారు. ఈ మొత్తం డబ్బులను పది నెలల్లో కార్మికుల నెలవేతనాల నుంచి కంపెనీ తిరిగి రికవరీ చేసుకుంటుంది.

ఏడుగురు పోకిరీల అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో బైపాస్ రోడ్డు, కాలేజ్ రోడ్డు, బస్టాండ్, రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాల్లో షీటీమ్ పోలీసులు శనివారం డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. షీటీమ్ ఎస్సై ఉషారాణి, సిబ్బందితో కలిసి మఫ్టీలో ఉండి మహిళలను వేధిస్తూ, విద్యార్థినులను ఇబ్బందులకు గురిచేసిన ఏడుగురు పోకిరీ యువకులను అదుపులో తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. మరోసారి ఇలాంటి ఘటనలకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా షీటీమ్ ఎస్సై మాట్లాడుతూ మహిళలు, విద్యార్థులను ఎవరైనా వేధింపులకు గురిచేయడం, వాట్సాప్ ద్వారా అసభ్యకరంగా మెసెజ్ పంపించిన వెంటనే 100 డయల్‌కు గాని, షీ టీమ్ వాట్సాప్ 6303923700 నంబర్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య

లక్సెట్టిపేట: అనారోగ్యంతో బాధపడుతూ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై గోపతి సురేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన దానపెల్లి వెంకటేశ్ (29) గతకొన్ని రోజులుగా జాండీస్‌తో బాధపడుతున్నాడు. ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకున్న నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం రాత్రి ఇంటి దాబాపై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి వివాహం కాలేదు. తండ్రి రాజయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఏరియాను సందర్శించిన సీసీవో ఓఎస్డీ

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాను శనివారం కోల్ కంట్రోల్ ఆఫీస్ (సీసీవో) ఓఎస్డీ జనరల్ మేనేజర్ డీవీ సుబ్రమణ్యం సందర్శించారు. ఏరియాలో మూతపడిన గనులతో పాటు పరిసర ప్రాంతాల్లో చేపట్టిన పర్యవరణ పనులపై చర్చించారు. బొగ్గు నాణ్యత, బొగ్గు సరఫరాపై సమీక్షించారు. బెల్లంపల్లి ఏరియా వివరాలను ఏరియా జీఎం విజయ భాస్కర్ రెడ్డి వెల్లడించారు. అనంతరం ఏరియాలోని అన్ని విభాగాల అధికారులతో కలిసి డీవీ సుబ్రమణ్యంను సత్కరించారు. ఖైరిగూర ప్రాజెక్టు అధికారి మచ్చగిరి నరేందర్, ఎస్వోటూజీఎం రాజమల్లు, గోలేటి ఓసీపీ పీవో ఉమాకాంత్, ఏరియా ఇంజనీరు కృష్ణమూర్తి, డీజీఎం సివిల్ ఎస్‌కే మదీనాబాషా, ఫైనాన్స్ మేనేజర్ రవి అన్ని విభాగాల అధిపతులు, అధికారులు పాల్గొన్నారు.

యూరియా పట్టివేత

కౌటాల: మండలంలోని శీర్షా గ్రామంలోని శ్రీ ఆంజనేయ, శ్రీ కొండయ్య ట్రేడర్లలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన యూరియా బస్తాలను ఏవో ప్రేమలత శనివారం పట్టుకున్నారు. ఆమె కథనం ప్రకారం..మంచిర్యాల నుంచి శీర్షా గ్రామంలోని శ్రీ ఆంజనేయ ట్రేడర్స్‌కు లారీలో 266, శ్రీ కొండయ్య ట్రేడర్స్‌కు 266 యూరియా బస్తాలు వచ్చాయి. వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వకుండా శనివారం వేకువజాము రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. అనుమతి లేకుండా పంపిణీ చేస్తున్నారనే సమాచారంతో గ్రామంలో విచారణ చేపట్టారు. శ్రీ ఆంజనేయ ట్రేడర్స్‌లో 72, శ్రీ కొండయ్య ట్రేడర్స్‌లో 46 యూరియా బస్తాలు నిల్వ ఉన్నాయి. అనుమతి లేని యూరియాను విక్రయించొద్దని డీలర్లు మల్లేశ్, తిరుపతికి ఆదేశించినట్లు ఏవో తెలిపారు. ఉన్నతాధికారులకు నివేదించామని, ఆపై వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు.

ఆకతాయికి షీటీం కౌన్సెలింగ్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్ పరిసర ప్రాంతంలో అమ్మాయిలను వేధిస్తున్న ఆకతాయిని శనివారం జిల్లా పోలీసు షీటీం అదుపులోకి తీసుకుంది. షీటీం సిబ్బంది అతనికి కౌన్సెలింగ్ నిర్వహించారు. షీటీం సభ్యులు స్వప్న, దినేష్, రజనీ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



షేక్ హుస్సేన్ మృతదేహం

దిలావర్‌పూర్: మండలంలోని సిర్గాపూర్ సమీపంలో నిర్మల్-భైంసా రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రవీందర్ కథనం ప్రకారం.. మండలంలోని న్యూలోలం గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ (40) నిర్మల్ వెళ్లి రాత్రి స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. సిర్గాపూర్ వద్ద ఐరన్ లోడ్‌తో ఆగి ఉన్న లారీని వేగంగా ఢీకొట్టాడు. హుస్సేన్ తల, ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి అతన్ని అంబులెన్స్‌లో నిర్మల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించినప్పటికి పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా, ప్రమాదానికి కారణమైన లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరు..

ఆదిలాబాద్‌రూరల్: అనుమానాస్ప స్థితిలో ఒకరు మృతి చెందినట్లు ఆదిలాబాద్ రూరల్ ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని అనుకుంట గ్రామానికి చెందిన మన్నె అశోక్ (50) వ్యవసాయ కూలీగా పనిచేస్తున్నాడు. గత 20 రోజులుగా ఛాతీనొప్పితో బాధపడుతున్నాడు. మూడు రో జులుగా కూలీ పనుల్లో భాగంగా గడ్డి మందు పిచికారీ చేశాడు. శుక్రవారం రాత్రి ఇంటి వద్ద వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబీకులు వెంట నే రిమ్స్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించా రు. మృతదేహాన్ని ఎస్సై శనివారం పరిశీలించి పంచనామా నిర్వహించారు. భా ర్య సంగీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దరఖాస్తు చేసుకోవాలి

మంచిర్యాలటౌన్: ఇందిరమ్మ మైనార్టీ మహిళా యోజన పథకం కింద పేద ముస్లిం మహిళలకు మోపెడ్ బైక్/ఈ-బైక్, రూ.50 వేల ఆర్థికసాయం కోసం దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి ఓ ప్రకటనలో తెలిపారు. పేద మహిళలు, వితంతువులు, విడాకులు పొందిన వారు, అనాథలు, ఒంటరి మహిళలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. రేవంత్ అన్నకా భరోసా మిస్కినో కే లియే పథకం కింద అందిస్తున్న మోపెడ్/ఈ-బైక్ కోసం అభ్యర్థులు ఫకీర్/దూదేకుల/బలహీన ముస్లిం వర్గానికి చెందిన వారై ఉండాలని పేర్కొన్నారు. tgobmms. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా అక్టోబర్ 6లోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 85558 41417 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

మళ్లీ నిండింది.. ఖాళీ అవుతోంది



గేట్ల ఎత్తివేతతో గోదావరిలో కలుస్తున్న వరదనీరు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ఇటీవల పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరగా మరోసారి వర్షాలకు శ్రీరాంసాగర్, కడెం ప్రాజెక్ట్, ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న భారీ వరద నీటితో మళ్లీ నిండింది. వరదను అంచనా వేస్తూ అధికారులు ఖాళీ చేసిన శనివారం ఉదయం వరకు 5 గేట్లకు కుదించినా భారీ వరదనీరు వస్తుండటంతో ప్రాజెక్ట్ నిండింది. నీటిమట్టం 20.175 టీఎంసీలతో నిండగా, సాయంత్రం నీటిని ఖాళీ చేయడం ప్రారంభించారు. ఇన్ ఫ్లో కింద 2.70 లక్షల క్యూసెక్కుల నీరు ప్రాజెక్ట్‌లోకి వచ్చి చేరుతుండగా, ఔట్ ఫ్లో కింద హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ పథకానికి 285 క్యూసెక్కులు, ఎన్టీపీసీకి 121 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు. ప్రాజెక్ట్‌లోని 62 గేట్లలో 30 గేట్లు తెరచి 3.20 లక్షల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలిపెడుతున్నారు.

సింగరేణిలో సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నేతలు
- సీఎంను కలిసి వినతిపత్రం అందజేత



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, ఏఐటీయూసీ నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో సమస్యలు పరిష్కరించాలని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు వి.సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ కోరారు. శనివారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సింగరేణి సంస్థ గత ఆర్థిక సంవత్సరం 2024-25లో సాధించిన లాభాలు ప్రకటించి అందులో కార్మికులకు 35 శాతం వాటా ఇవ్వాలని కోరారు. ఎన్నోఏళ్లుగా కార్మికులు ఎదురుచూస్తున్న సొంతింటి పథకాన్ని నెరవేర్చాలన్నారు. పెర్క్స్‌పై పడుతున్న ఆదాయ పన్ను కంపెనే చెల్లించాలన్నారు. కోలిండియాలో మాదిరిగా సింగరేణిలో అమలు చేయాలని కోరారు. మెడికల్ బోర్డును ప్రక్షాళన చేయాలని, దీనికోసం 1981లో ఉన్న అన్‌ఫిట్ విధానం అమలు చేయాలన్నారు. మారుపేర్ల సమస్య పరిష్కరించాలని కంపెనీ దీనిపై అడ్వొకేట్ జనరల్ అభిప్రాయం కోరిందని, చర్చించి సానుకూల నిర్ణయం తీసుకోవాలన్నారు. కొత్త గనులు ఏర్పాటుతోపాటు కోయగూడెం, సత్తుపల్లి, తాడిచెర్ల బ్లాక్‌లు సింగరేణికే కేటాయించేలా నిర్ణయం తీసుకోవాలన్నారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించారు. లాభాల వాటా విషయమై త్వరగా సెటిల్ చేస్తామని సంస్థ సీఎండీని పిలిచి డిప్యూటీ సీఎంతో సమావేశం ఏర్పాటు చేస్తానని సీఎం తెలిపినట్లు ఏఐటీయూసీ నేతలు పేర్కొన్నారు.

ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలి



మంత్రి సురేఖకు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

ఖానాపూర్: మారుమూల పల్లెలోని అటవీ ప్రాంతాల దృష్ట్యా ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అటవీశాఖ అనుమతి ఇవ్వాలని కోరుతూ రాష్ట్రమంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ శుక్రవారం రాత్రి వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని పలు మండలాలకు వంతెనలు లేక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పలుచోట్ల ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని విన్నవించారు. ఉట్నూర్‌తోపాటు పెంబి మండలాల్లో మొత్తం ఆరు ఐరన్ బ్రిడ్జిల నిర్మాణానికి సుమారు రూ.18 కోట్ల నిధులు మంజూరు చేయాలని గతంలో మంత్రి సీతక్కకు విన్నవించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం అటవీ శాఖ రాష్ట్ర ఉన్నతాధికారి డాక్టర్ సువర్ణను కలిసి ఈవిషయమై వినతిపత్రం అందజేశారు.

'కుట్రపూరితంగానే లాభాల జాప్యం'



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

శ్రీరాంపూర్: కుట్రపూరితంగానే కంపెనీ వాస్తవ లాభాలు ప్రకటించడం లేదని టీబీజీకేఎస్ కేంద్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి తెలిపారు. శనివారం ఆర్కే న్యూటెక్ గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు కావస్తున్నా ఇప్పటికీ కంపెనీకి ఎన్ని లాభాలు వచ్చాయో ప్రకటించలేదన్నారు. గత సంవత్సరం లాభాలను తక్కువ చేసి చూపించిన తర్వాత వాటా పంపిణీ చేశారని, నేడు అదే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. వాస్తవ లాభాలు ప్రకటించి అందులో నుంచి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో ప్రకటించకపోతే జీఎం కార్యాలయాల ఎదుట బతుకమ్మ ఆడుతూ నిరసన తెలుపుతామన్నారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు టీబీజీకేఎస్‌లో చేరారు. యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి, కేంద్ర కమిటీ నాయకులు పానుగంటి సత్తయ్య, పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, ఎండీ లాల, డివిజన్ నాయకులు సాదుల భాస్కర్, వెంగళ కుమార్ స్వామి, సంపత్, జైపాల్‌రెడ్డి, దేవేందర్, తిరుపతిరావు, అశోక్, పిట్ సెక్రెటరీలు రాజు నాయక్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా కేంద్రాలపై దాడులు



పట్టుకున్న బెల్లం పానకంతో ఎక్సైజ్ సిబ్బంది

చెన్నూర్‌రూరల్: ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కోటపల్లి మండలంలోని సిర్స, ఆలుగామ గ్రామాల్లో నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీ చేస్తున్న ఏడుగురిపై కేసు నమోదు చేసి, 23 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని 1900 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు ఎక్సైజ్ సీఐ ఎం.హరి తెలిపారు. జనవరి నుంచి ఇప్పటివరకు 234 కేసులు నమోదు చేసి 249 మందిని అరెస్టు చేయగా, 1289 లీటర్ల నాటుసారా, 30 వాహనాలు స్వాధీనం చేసుకుని, 4 వేల లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా 179 మందిని బైండోవర్ చేయగా, బైండోవర్ ఉల్లంఘించిన ఐదుగురికి రూ.3.50 లక్షల జరిమానా వి. దించినట్లు తెలిపారు. ఎక్కువ కేసులు నమోదైనవారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నాటుసారా పట్టివేత

చింతలమానెపల్లి: మండలంలోని లంబడిహెట్టి, రణవెల్లి గ్రామాల్లో శనివారం దాడులు చేసి నాటుసారాను పట్టుకున్నట్లు అబ్కారీ శాఖ సీఐ వి.రవి తెలిపారు. గ్రామశివారుల్లో 300 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 20 కిలోల బెల్లాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. లంబడిహెట్టి గ్రామానికి చెందిన బానోత్ ధన్‌రాజ్ బైక్‌పై అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల గుడుంబాను పట్టుకున్నామని తెలిపారు. ధనరాజ్‌పై కేసు నమోదు చేసి బైక్‌ను సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సైలు లోభానంద్, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్ట్రక్చరల్ సమావేశంలో డిమాండ్లు



జీఎంతో చర్చిస్తున్న గుర్తింపు సంఘం నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి యాజమాన్యానికి గుర్తింపు సంఘం, ఏఐటీయూసీ నాయకులకు మధ్య ఏరియా స్థాయి స్ట్రక్చరల్ సమావేశం జరిగింది. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం జరిగిన సమావేశానికి జీఎం ఎం.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎస్కే బాజీసైదా, ఇతర ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్మికుల పలు డిమాండ్లపై చర్చించారు. ఎస్ఆర్పీ 3 గనిలో రెస్ట్ హాల్ ఎత్తును పెంచి రూఫ్‌షీట్లు మార్చాలని కోరారు. క్యాంటీన్ పూర్తిగా ఆధునీకీకరించాలని, మహిళల కోసం ప్రత్యేక వాష్‌రూమ్స్‌ను నిర్మించాలన్నారు. ఎస్ఆర్పీ 1 గనిలో కోల్‌కట్టర్ రూమ్‌లను బాగు చేయాలన్నారు. ఈ సమస్యలపై చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని జీఎం హామీ ఇచ్చినట్లు నేతలు తెలిపారు. సమావేశంలో యూనియన్ చర్చల ప్రతినిధులు కొట్టే కిషన్ రావు, భద్రి బుచ్చయ్య, శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్.. ముగ్గురి అరెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ప్లాటును తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న ముగ్గురిని శనివారం అరెస్టు చేసినట్లు మావల సీఐ కర్రె స్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. విజయ్ పాల్కుర్వార్ 2011లో ఎంప్లాయీస్ కాలనీలో ప్లాటు కొనుగోలు చేశారు. ఆ ప్లాటు పెయింటర్ సంజీవ్ సహకారంతో వెంకటరమణ గతేడాది అప్పటి సబ్ రిజిస్ట్రార్‌తో రఘుపతి పేరిట మళ్లీ రిజిస్ట్రేషన్ చేయించారు. ముందుగా ప్లాటు కొనుగోలు చేసిన విజయ్ పాల్కుర్‌వార్‌ను బెదిరించి కబ్జా చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. అప్పటి సబ్ రిజిస్ట్రార్‌పై కేసు నమోదు చేశామన్నారు.

దేశీదారు తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్ర నుంచి అక్రమంగా దేశీదారును బైక్‌లపై జిల్లాకు తరలిస్తున్న ఇద్దరిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎక్సైజ్ సీఐ విజేందర్ తెలిపారు. భీంపూర్ మండలంలోని కరంజీ గ్రామానికి చెందిన కడదారపు ఇస్తారి, వడూర్‌కు చెందిన అగ్గు పూజేరావులు 50 దేశీదారు సీసాలు తీసుకువస్తుండగా దాడి చేసి పట్టుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.వీటివిలువ రూ.6వేల వరకు ఉంటుందన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

నెన్నెల: భార్యను వేధిస్తున్న భర్తపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..నెన్నెల మండలం చిత్తాపూర్‌కు చెందిన బిటుకు నళినికి జగిత్యాల జిల్లా అంబర్‌పేట గ్రామానికి చెందిన బిటుకు కిష్టయ్య అనే ట్రాక్టర్ డ్రైవర్‌తో 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కిష్టయ్య 2022లో దుబాయ్‌కి వెళ్లాడు. తిరిగి మూడునెలల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. అప్పటి నుంచి భార్యపై అనుమానంతో అక్రమ సంబంధం అంటగడుతూ కొడుతూ మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. నెల క్రితం నళిని తల్లిగారిల్లు అయిన చిత్తాపూర్‌కు వెళ్లి ఉంటుంది. భర్త కిష్టయ్య ఈనెల 12న అక్కడికి వెళ్లి నళిని కొట్టి చంపుతానని బెదిరించాడు. కట్నం తీసుకువస్తేనే ఉంచుకుంటానని లేకపోతే విడాకులు ఇస్తానని వేధించాడు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

క్లుప్తంగా

అభివృద్ధిలో నాణ్యత పాటించాలి



ఇంకుడు గుంతలను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో

ఇంద్రవెల్లి: అమరవీరుల స్తూపం వద్ద ఏర్పాటు చేసిన స్మృతి వనంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని డీఆర్‌డీవో రవీందర్ రాథోడ్ అన్నారు. శనివారం మండలంలోని అమరవీరుల స్తూపాన్ని సందర్శించి ఇంకుడు గుంతలను పరిశీలించారు. పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్మృతి వనంలో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు వనంలో నాటిన మొక్కల రక్షణ కోసం అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి, పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో జాదవ్ శ్రీనివాస్, టెక్నికల్ అసిస్టెంట్‌లు మహేందర్, విఠల్ పాల్గొన్నారు.

కల్తీ కల్లు అమ్మితే చర్యలు

భీంపూర్: కల్తీ కల్లు అమ్మితే చర్యలు తప్పవని ప్రొహిబిషన్ ఎక్సైజ్ సీఐ విజేందర్ హెచ్చరించారు. మండలంలోని కరంజి గ్రామానికి చెందిన కడదరపు ఇస్తారి, వాడూరు గ్రామానికి చెందిన అగ్గు పూనేరావు వద్ద రూ.6 వేల విలువచేసే 150 దేశీదారు బాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం అమ్ముతున్నారని పక్కా సమాచారంతో శనివారం దాడులు నిర్వహించారు. మహారాష్ట్ర నుంచి మోటార్ సైకిళ్లపై మద్యాన్ని తీసుకువస్తున్న సమయంలో వారిని పట్టుకొని కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పరిశీలన

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను ఎంపీడీవో రమేశ్ శనివారం పరిశీలించారు. ప్రతీ సోమవారం ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన నిధులను దశలవారీగా విడుదల చేస్తోందన్నారు. లబ్ధిదారులు ప్రణాళికబద్ధంగా ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలను సందర్శించారు. విద్యార్థుల సౌకర్యాలు, పాఠశాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించి, సిమెంట్ కాంక్రీట్ ఉపయోగించి తాత్కాలిక మరమ్మతులు చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

సీపీఐ జాతీయ మహాసభకు ఆహ్వానం

కైలాస్‌నగర్: ఈనెల 21 నుంచి 25 వరకు పంజాబ్ రాష్ట్రం చండీగఢ్‌లో జరుగనున్న సీపీఐ జాతీయ మహాసభకు హాజరుకావాల్సిందిగా జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ మేరకు మహాసభలో పాల్గొనేందుకు బయలుదేరిన ఆయనను పార్టీ నాయకులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ముడుపు నళిని రెడ్డి, సభ్యులు గోవర్ధన్, కుంటాల రాములు, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అట్టహాసంగా ఫ్రెషర్స్ డే

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శనివారం అట్టహాసంగా నిర్వహించారు. జూనియర్లకు స్వాగతం పలుకుతూ సీనియర్లు చేసిన నృత్యం ఆకట్టుకుంది. సినీ, జానపద, దేశభక్తి గీతాలపై చేసిన నృత్యాలు అలరించాయి. వారిని ప్రోత్సహించేలా తోటి విద్యార్థులు చప్పట్లతో ఉత్సాహపరిచారు. డీఐఈవో గణేష్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే నష్టాలు, యువత ఏ విధంగా నాశనమవుతుందనే అంశంపై విద్యార్థినులు చేసిన నాటిక ఆలోచింపజేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సూరజ్‌సింగ్, అధ్యాపకులు ప్రతాప్, భగవన్, ప్రేమేందర్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

ఉట్నూర్‌రూరల్: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, దినసరి ఉద్యోగులు ఐటీడీఏ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసన శనివారం 9 రోజులకు చేరింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు వంటావార్పు చేసి నిరసన తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు వారికి మద్దతు తెలిపారు. రిటైర్ ఉద్యోగులు లక్ష్మణాచారి, కొండయ్య, కనక రావు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా పంపిణీలో నిర్లక్ష్యం

బేల: యూరియా పంపిణీ నిర్లక్ష్యం రైతుకు శాపంగా మారిందని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. శనివారం మండలంలోని రంఖం గ్రామంలో యూరియా పంపిణీలో పోలీసులతో ఇబ్బందులకు గురైన రైతు కుడిమెత మాధవ్‌రావుతో పాటు ఇతర రైతులను పరామర్శించారు. యూరియా పంపిణీలో పోలీసులు టోకన్లు పంపిణీ చేయడంపై మండిపడ్డారు. ఆయన వెంట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, ప్రమోద్‌రెడ్డి, సతీష్‌పవార్, తేజ్‌రావు, విపిన్, విశాల్ ఉన్నారు.

అంబరాన్నంటిన సంబురాలు



తలమడుగు: బతుకమ్మ పేర్చుతున్న విద్యార్థినులు



బోథ్: నృత్యం చేస్తున్న విద్యార్థులు



ఆదిలాబాద్‌టౌన్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



సాత్నాల: బతుకమ్మలతో విద్యార్థులు



ఆదిలాబాద్‌టౌన్: బతుకమ్మలతో విద్యార్థినులు



తాంసి: తాంసి పాఠశాలలో..

జిల్లా వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం నుంచి దసరా సెలవులు ఉండటంతో పలు విద్యాసంస్థల్లో శనివారం ముందస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. రంగురంగుల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి ఆడిపాడారు. ఆదిలాబాద్ పట్టణంలోని ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో జరిగిన వేడుకలకు అడిషనల్ కలెక్టర్ శ్యామలాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బతుకమ్మలను ఒక చోట చేర్చి వాటి చుట్టూ నృత్యం చేశారు. విద్యార్థినుల సంప్రదాయ నృత్యం ఆకట్టుకుంది. అలాగే మావల మండల కేంద్రంలోని చావరా అకాడమీ బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. పాఠశాల నిర్వాహకులు థామస్, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



ఇచ్చోడ: బతుకమ్మ ఆడుతున్న ఉపాధ్యాయులు



ఆదిలాబాద్: బతుకమ్మ వేడుకల్లో విద్యార్థులు



బేలలో..

విద్యార్థులు కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న జీసీడీవో ఛాయాదేవి

ఇంద్రవెల్లి: విద్యార్థులు కష్టపడి చదవాలని జీసీడీవో ఛాయాదేవి అన్నారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని చిచ్‌ధరి ఖానాపూర్ ఆశ్రమ బాలికల వసతి గృహంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. దసరా సెలవులు ముగిసిన వెంటనే పిల్లలను పాఠశాలకు పంపించాలని సూచించారు. సెలవుల్లో ఇంటికొచ్చిన తరువాత పిల్లలకు వేరే పని చెప్పకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పదో తరగతి విద్యార్థినులు సెలవులకు ఇంటికెళ్లినప్పుడు చదువుపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జాదవ్ శేరావ్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

సన్మానం

నార్నూర్: ఆదిలాబాద్ జెడ్పీ సీఈవోగా విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డిని శనివారం సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ మార్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. కలెక్టర్ రాజర్షిషాతో పాటు జెడ్పీ సీఈవోగా నార్నూర్ మండలాన్ని నీతి ఆయోగ్‌లో చేపట్టిన అభివృద్ధిని గుర్తు చేసుకున్నారు. డిప్యూటీ సీఈవో రాథోడ్ రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

అందని అత్యవసర సేవలు..!

- 24 గంటలు వైద్యం అందించాలని కోరుతున్న ప్రజలు
- ప్రాథమిక సేవలకే పరిమితమవుతున్న పీహెచ్‌సీ
- తీవ్ర ఇబ్బంది పడుతున్న జనం



తాంసిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

తాంసి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు వైద్య సేవలు అందించాలని మండల ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలు కోరుతున్నారు. స్థానిక పీహెచ్‌సీలో నిర్ణీత సమయంలో మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. రాత్రి పూట సరైన వైద్యం అందక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయంలో వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని రిమ్స్ లేదా ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం మండలంలోని వివిధ గ్రామాల్లో జ్వరాలతో పాటు, వివిధ రకాలైన వ్యాధులతో బాధపడుతున్న వారు ఆస్పత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నప్పటికీ రాత్రి సమయాల్లో, అత్యవసర సమయాలల్లో ఏవైనా జరిగితే జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ చేయాలని వినతి..

మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేసి 24 గంటల వైద్య సేవలు అందేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు. గత కొన్నేళ్లుగా జిల్లా వైద్యాశాఖ అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందించినా.. ఫలితం ఉండడం లేదు. ఆరోగ్య కేంద్రాన్ని విస్తరించి అప్‌గ్రేడ్ చేయాలని కోరుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. మండలంలో ప్రస్తుతం 14 గ్రామ పంచాయతీలు ఉండగా, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, గొల్లఘాట్, తాంసి(కె) గ్రామాలు సైతం తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తాయి. దాదాపుగా 25 వేలకు పైగా జనాభా తాంసి ఆరోగ్య కేంద్రం పరిధిలోకి వస్తోంది.

మెరుగైన సేవలు అందించాలి



తాంసి ఆరోగ్య కేంద్రంలో 24 గంటల పాటు వైద్యసేవలు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. గ్రామీణ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్ణీత సమయంలో మాత్రమే వైద్యం అందించడంతో ప్రజలకు సరైన వైద్యం అందడం లేదు. రాత్రి పూట అత్యవసర సమయంలో జిల్లా కేంద్రంలోని ఆస్పత్రులకు వెళాల్సి వస్తుంది.

– రాములు యాదవ్, తాంసి

చిన్న వ్యాధులకే సేవలు



ఆరోగ్య కేంద్రంలో పూర్తి స్థాయిలో రోగులకు అన్ని రకాల వైద్యసేవలను అందించే విధంగా ఆరోగ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయాలి. చిన్న చిన్న రోగాలకు మాత్రమే ఇక్కడ వైద్యం అందడంతో ఇతర వ్యాధులకు జిల్లా కేంద్రంలో రిమ్స్ ఆస్పత్రి లేదా ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లాల్సి వస్తుంది. అధికారులు స్పందించి ఆరోగ్య కేంద్రంలో రౌండ్ ది క్లాక్ వైద్య సేవలను అందించాలి.

– మలపతి శంకర్, పొన్నారి గ్రామస్తుడు

సాయంత్రం వరకే సిబ్బంది

తాంసి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రస్తుతం ఉదయం నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మాత్రమే సిబ్బంది అందుబాటులో ఉంటారు.ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యాధికారి,వైద్య సిబ్బంది అందబాటులో ఉన్న సమయంలో మాత్రమే వైద్యం చేయించుకోవాల్సిన పరిస్థితి ఉంది.అవి కూడా చిన్న చిన్న రోగాలకు మాత్రమే జ్వరంతో పాటు ఇతర వ్యాధులకు మాత్ర మే వైద్యసేవలు అందుతున్నాయి.ప్రసవాలు,ఇతర ఏమైనా సమస్యలు,రోడ్డు ప్రమాదాల బారిన పడి ఇక్కడికి వచ్చినా పూర్తి స్థాయిలో వైద్య సదుపాయాలు లేవు.మండల కేంద్రంలో ఆరోగ్య కేంద్రం ఆరో గ్య కేంద్రాన్ని అప్‌గ్రేడ్ చేయక పోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.ఇప్పటికైనా మండల కేంద్రం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మండల ప్రజల వైద్యసేవల దృష్ట్యా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారించి 24 గంటల పాటు వైద్య సేవలు అందే విధంగా అప్‌గ్రేడ్ చేసే విధంగా చర్యలు చేపట్టాలని మండలవాసులు కోరుతున్నారు.

సర్కారు బడుల్లో వసతులు కల్పించాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రైవేట్‌కు ధీటుగా రాణించాలంటే బోధనతో పాటు సౌకర్యాలు కల్పించాల్సిన అవసరముందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గజిటెడ్ ఉన్నత పాఠశాలలో పీఎంశ్రీ అన్యూవల్ వర్కింగ్ ప్లాన్ కింద మంజూరైన అదనపు తరగతి గదుల నిర్మాణానికి శనివారం భూమిపూజ చేశారు. ప్రస్తుతం విద్యావ్యవస్థలో సమూల మార్పులు వచ్చాయన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో వసతులు కల్పించాలని కోరారు. అంతకు ముందు కార్యక్రమంలో ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య, పాఠశాల హెచ్‌ఎం నీలాదేవి, బీజేపీ ప్రవీణ్, కృష్ణయాదవ్, జోగు రవి, విజయ్, ముకుంద్ పాల్గొన్నారు.

పింఛన్లు పెంచాలని ఆందోళన

బోథ్: పింఛన్లు పెంచాలని, అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని పొచ్చెర, కుచులాపూర్, బోథ్ గ్రామ పంచాయతీ కార్యాలయాల ఎదుట ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులు, గ్రామస్తులు ధర్నా చేపట్టారు. రాష్ట్ర నాయకులు కుడాల స్వామి మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేయూత పథకం కింద పింఛన్లు రూ. 4000, వికలాంగులకు రూ. 6000, పెంచుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ధర్నాలో ఎమ్మార్పీఎస్ నాయకులు కుడాల స్వామి, అన్నెపాక అశోక్, కారం రవి, పింఛనుదారులు పాల్గొన్నారు.

బజార్‌హత్నూర్: నిత్యావసర ధరలకు అనుగుణంగా వృద్ధులకు, దివ్యాంగులకు బీడీ కార్మికులు, వితంతులకు అందిస్తున్న పింఛన్లు పెంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు గోట్ముకులే మధుకర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని దేగామ, బోస్రా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు శంకర్, అశోక్‌లకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గోదుమాల అనిల్, తదితరులు పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న దివ్యాంగులు

కలెక్టరేట్ ఎదుట ఎన్‌పీఆర్‌డీ రిలేదీక్షలు

కై లాస్‌నగర్: కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6వేలకు పెంచాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఎన్నికల సమయంలో పెన్షన్‌ను పెంచుతామని ప్రకటించిన ప్రభుత్వం రెండేళ్లు గడుస్తున్నా.. అమలు చేయకపోవడం సరికాదన్నారు. స్వయం ఉపాధికోసం రుణాలను మంజూరు చేయడంతో పాటు బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు, దివ్యాంగులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

ఇచ్చోడ: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం అడేగామ(బి) గ్రామంలో నిర్వహించిన వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌వో బ్రహ్మానందంరెడ్డి, ఆయూష్ డాక్టర్ అవినాశ్, హరిత, రాజుబాయి, హెల్త్ అసిస్టెంట్లు రాథోడ్ కైలాస్, సుభాష్ పాల్గొన్నారు.

జైనథ్: వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్య శిబిరం ఇన్‌చార్జి సీహెచ్‌వో అంజయ్య అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, ఎంఎల్‌ఎం ప్రియాంక, గంగాదేవి, ఆశ వర్కర్లు స్రవంతి, లక్ష్మి, కవిత పాల్గొన్నారు.

భీంపూర్: సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ సూచించారు. శనివారం న్యూ గోవింద్పూర్, కట్టగూడ, కరంజి, ఇంధూర్పల్లి గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తీర్ణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రూహిదాస్, సంధ్యారాణి, మాయావతి,, సాహితి, లచ్చుబాయ్, సరస్వతి, సుజాత, భాగ్యవతి పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్: అంకోలి ఆసుపత్రిలో శనివారం రిమ్స్ వైద్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ నరేందర్ రాథోడ్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కుడ్మెత మనోహర్, శ్రీధర్ మిట్టపల్లి, స్త్రీ వైద్య నిపుణురాలు వావిలా, పిల్లల డాక్టర్ సిద్ధార్థ, ప్రశాంతి, ప్రకాష్ పాల్గొన్నారు.

సాత్నాల: మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. భోరజ్ మండలం గిమ్మ గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అశ్విన్ జనరల్ మెడిసిన్, ఇందు జనరల్ సర్జరీ, ఆశిష్ కుమార్ పర్మనాలజిస్ట్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో గిమ్మ మెడికల్ ఆఫీసర్ సుచల, హెచ్‌ఈవో రాంరెడ్డి, అనిత, ఫార్మసిస్ట్ శివయ్య పాల్గొన్నారు.

పేషెంట్ సేఫ్టీ కాన్ఫరెన్స్‌లో రిమ్స్ డైరెక్టర్



వైద్యాధికారులతో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: రోగుల ఆరోగ్య భద్రత అనే అంశంపై ఆంధ్రప్రదేశ్‌లో శనివారం జాతీయస్థాయి సదస్సు జరిగింది. గుంటూర్ జిల్లా మంగళగిరి మెడికల్ కళాశాలలో ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ హాజరయ్యారు. రోగుల రక్షణ, వైద్య, రోగ నిర్ధారణ పరీక్షలు, రక్త నమూనల సేకరణ, చికిత్స వంటి తదితర అంశాలపైన సదస్సులో చర్చించారు. సదస్సుకు కేంద్ర ప్రభుత్వ డీజీహెచ్‌ఎస్ సుజాత చౌదరి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

విచ్చలవిడిగా కల్తీ సరుకుల అమ్మకాలు



పట్టుకున్న కల్తీ సరుకులతో నాయకులు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలో అమాయక గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని కల్తీ, నకిలీ పదార్థాలు, సరుకుల విక్రయాలు ఆరికట్టడంతో అధికారులు విఫలం అయ్యారని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు పెందూర్ సంతోష్ ఆరోపించారు. శనివారం గాదిగూడ మార్కెట్‌లో విక్రయిస్తున్న నకిలీ వస్తువులు, కల్తీ సరుకులను పట్టుకున్నారు. గడువు అయినపోయిన సరుకులు అమ్మడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టుకున్న సరకులతో గాదిగూడ మండల కేంద్రంలోని కుమురం భీంచౌక్ వద్ద అధికారుల పని తీరుపై నిరసన తెలిపారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆదివాసీల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు మనోహర్, కనక ప్రభాకర్, మడావి చంద్రహరి, మడావి యశ్వంతరావు, మెస్రం వామన్, గంగారాం పాల్గొన్నారు.

ఇసుకను అక్రమ రవాణా చేస్తే చర్యలు

సాత్నాల: అక్రమంగా ఇసుకను రవాణా చేస్తే చర్యలు తప్పవని ఎస్సై గౌతమ్ పవర్ అన్నారు. భోరజ్ మండలం పెండాల్‌వాడ గ్రామంలో శుక్రవారం రాత్రి ఇసుక అక్రమంగా రవాణా చేస్తున్నారని పక్కా సమాచారం రావడంతో దాడులు చేసి, జేసీబీ, రెండు ట్రాక్టర్లను సీజ్ చేయడం జరిగిందన్నారు. ఆయన మాట్లాడుతూ ఇసుక ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు రవాణా ఎట్టి పరిస్థితుల్లో సహించబోమన్నారు. నిబంధనలు ఉల్లంఘించి, ఇసుక మాఫియాకు సహకరించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు వికాస్, రజినీకాంత్, అఫ్జల్ పాల్గొన్నారు.

సంక్షిప్తం..

బీఎల్‌వోలు చిత్తశుద్ధితో పనిచేయాలి

సాత్నాల: బీఎల్‌వోలు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆర్డీవో స్రవంతి అన్నారు. శనివారం సాత్నాల తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2002 నుంచి 2025 జనాభా నిష్పత్తిని మ్యాపింగ్ చేయాలని సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో ప్రతి ఒక్క అధికారి పకడ్బందీగా విధులు నిర్వర్తించాలన్నారు. ఆయన వెంట జాదవ్ రామారావు, ఆర్ఐ సాయి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆదికర్మ అభియాన్'తో అభివృద్ధి

నేరడిగొండ: మారుమూల ఆదివాసీ గ్రామాలను అభివృద్ధి చేయడమే ఆది కర్మయోగి ముఖ్య ఉద్దేశమని బ్లాక్ మాస్టర్ ట్రైనీ జాదవ్ తానాజీ అన్నారు. ఆదికర్మ యోగ్యంలో భాగంగా శనివారం లింగట్ల గ్రామ పంచాయతీలోని మారుమూల గ్రామమైన చింతగూడలో గ్రామసభ నిర్వహించారు. అందుబాటులో ఉన్న వనరులను గుర్తించడానికి తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సునీల్, గిరిజన ఉపాధ్యాయులు దేవరావు, మోతిలాల్, బాబుజీ నాయక్, అంగన్‌వాడీ టీచర్ సుష్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముగిసిన హిందీ దినోత్సవం

తలమడుగు: మండలంలోని సుంకిడి ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవ వేడుకలు ముగిశాయి. హిందీ భాష సేవా సమితి జిల్లా అధ్యక్షుడు పాఠశాల హిందీ సీనియర్ ఉపాధ్యాయులు సుకుమార్ పేట్కులే విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఇందులో గెలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం జైవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. హిందీ ఉపాధ్యాయుడు సుకుమార్ పెట్కులే హిందీ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఉపాధ్యాయులు సుకుమర్, రాంరెడ్డి, సుజాత పాల్గొన్నారు.

గ్రామాల్లో చెత్తకుప్పలు దర్శనం

ఇచ్చోడ: కేసీఆర్ పాలనలో గ్రామాల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయని ముఖార(కె) మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి ఆరోపించారు. శనివారం గ్రామంలో తోపుడు బండితో వీదివిధి తిరుగుతూ.. చెత్తను సేకరించారు. కేసీఆర్ హయాంలో ప్రతీ గ్రామానికి ట్రాక్టర్, వాటర్ ట్యాంక్ అందించినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక ట్రాక్టర్లకు డీజిల్ లేక కార్మికులకు జీతాలు చెల్లించ లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పంచాయతీ ఎన్నికలు నిర్వహించి పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

అయోమయం



ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తి బండ్లు (ఫైల్)

- పత్తి రైతుల పరిస్థితి
- కొనుగోళ్లలో కపస్ కిసాన్ యాప్
- స్లాట్ బుకింగ్ విధానంలో..
- అమలు చేయాలంటున్న సీసీఐ
- తర్జనభర్జనలో మార్కెటింగ్ శాఖ

సాక్షి, ఆదిలాబాద్: పత్తి కొనుగోళ్లలో ఈ సీజన్ నుంచి ధర వ్యత్యాస చెల్లింపు పథకం (పీడీపీఎస్) ఆదిలాబాద్ మార్కెట్‌లో ప్రయోగాత్మకంగా అమలంటూ చర్చ సాగింది. ఇప్పుడు దానిపై ఊసే లేకుండా పోయింది. తాజాగా కపస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుకింగ్ విధానంలో పత్తి కొనుగోళ్లు చేయాలంటున్నారు. తప్పనిసరిగా దీన్ని అమలు చేయాలని సీసీఐ చెబుతుండగా, దీని విషయంలో మార్కెటింగ్ శాఖ తర్జనభర్జనలో ఉంది. మరో వారంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఏదైనా నిర్ణయం రావచ్చని అధికారులు అంటున్నారు. అయితే రైతులు మాత్రం అయోమయంలో ఉన్నారు. ఈ కొత్త విధానాలపై అవగాహన లేదని, రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వాలు ముందుకెళ్లాలని రైతు సంఘాల ప్రతినిధులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ మద్దతు అవసరం

ఈ సీజన్ నుంచి పత్తి సేకరణలో కొత్త విధానాన్ని అమలు చేస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వ మద్దతు అవసరమని సీసీఐ పేర్కొంటుంది. శుక్రవారం హైదరాబాద్‌లో 2025–26 సీజన్‌లో పత్తి సేకరణకు సంబంధించి సీసీఐ, రాష్ట్ర వ్యవసాయాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమావేశం నిర్వహించారు. సీసీఐ అధికారులు కొత్త విధానం అమలుపై మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. పత్తి విక్రయించేందుకు కపస్ కిసాన్ యాప్ ద్వారా రైతులు స్లాట్ నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఈ విషయంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోయిన సీసీఐ తప్పనిసరిగా దీన్ని అమలు చేయాలని ఒత్తిడి తీసుకువస్తుంది.

కపస్ కిసాన్ యాప్

సీసీఐ కపస్ కిసాన్ యాప్‌ను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చింది. పలు రాష్ట్రాల్లో క్రాప్ బుకింగ్ విధానం అమల్లో లేకపోవడంతో యాప్ రిజిస్ట్రేషన్ ఇప్పటికే మొదలుపెట్టారు. తెలంగాణలో క్రాప్ బుకింగ్ విధానం, రైతు సంబంధించిన వివరాలు ఉండటంతో యాప్ రిజిస్ట్రేషన్ అవసరం లేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. అయితే సీసీఐ చెబుతున్నట్లుగా ఈ యాప్ ద్వారానే కొనుగోళ్లు చేయాల్సి వచ్చిన పక్షంలో తప్పనిసరిగా రైతులు వారం ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలి. అలా అయితేనే మార్కెట్‌లో పత్తిని అమ్ముకునే పరిస్థితి.

రైతులకు ఇబ్బందికరం



స్లాట్ బుకింగ్ విధానంలో రైతులు పత్తిని అమ్ముకోవాలంటే ముందుగా ఆన్‌లైన్‌పై వారికి అవగాహన ఉండాలి. స్మార్ట్‌ఫోన్లు తప్పనిసరిగా ఉండాలి. మెజార్టీ రైతులు నిరాక్షరాస్యులకు అవగాహన లేదు. ఒకవేళ స్లాట్ బుకింగ్ చేసుకుంటే ఆ సమయానికి బండి దొరకకపోతే ఎలా.. ఇలాంటి అనేక సందేహాలు ఈ విధానంపై ఉన్నాయి.

– గోవర్దన్ యాదవ్, రైతు సంఘం ప్రతినిధి, ఆదిలాబాద్

రైతుకు డబ్బులు అత్యవసరమైతే



పత్తి దిగుబడి వచ్చాక రైతు మార్కెట్‌లో అమ్మి తన అవసరాలకు డబ్బులు వినియోగిస్తారు. ఈరోజు డబ్బులు అవసరముంటే స్లాట్ వారం తర్వాత దొరికితే ఎట్లా. స్లాట్ బుకింగ్‌లో మూడు సార్లు క్యాన్సల్ అయితే నాలుగోసారి ఆ రైతుకు అవకాశం దొరకదని చెబుతున్నారు. ఇలాంటప్పుడు రైతు పత్తిని ఎక్కడ అమ్ముకోవాలి. జిల్లాలోని అనేక ప్రాంతాల్లో సిగ్నల్ వ్యవస్థలు సరిగ్గా లేవు.

– రాజు చింతావార్, పత్తి వ్యాపారి, ఆదిలాబాద్

ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా



స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలని సీసీఐ కోరుతుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిర్ణయం రావాల్సి ఉంది. రాష్ట్రంలో క్రాప్ బుకింగ్ విధానం ఉండటంతో కపస్ కిసాన్ యాప్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిన అవసరం లేదు. నేరుగా స్లాట్ బుకింగ్ విధానం అమలు చేయాలంటే మాత్రం చేయాల్సి వస్తుంది.

– గజానంద్, జిల్లా మార్కెటింగ్ అధికారి, ఆదిలాబాద్

భూములన్నీ 'ప్రొహిబిటెడ్'

- 'ధరణి' తెచ్చిన సమస్య
- మూడు గ్రామాల రైతుల తిప్పలు..
- ఏళ్లుగా పరిష్కారం కానివైనం..
- భూ భారతితో సమస్య పరిష్కారం అయ్యేనా?



న్యూ కంజర్ గ్రామ పంచాయతీ భవనం

లక్ష్మణచాంద: రైతుల భూసమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం 2020లో ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. అయితే, ఈ పోర్టల్ అమలుతో మండలంలోని న్యూ కంజర్, పొట్టపల్లి(బి), పొట్టపెల్లి(కె) గ్రామాల రైతుల భూములు 'ప్రొహిబిటెడ్'(అసైన్డ్) భూములుగా గుర్తించబడ్డాయి. దీంతో, ఈ గ్రామాల రైతుల పట్టా పాస్‌బుక్‌లలో భూమి స్వరూపం వద్ద 'అసైన్డ్ (ప్రొహిబిటెడ్)' అని ఆన్‌లైన్‌లో నమోదైంది. ఫలితంగా, 2020 నుంచి ఈ మూడు గ్రామాలలో భూముల క్రయవిక్రయాలు పూర్తిగా నిలిచిపోయాయి.

ఐదేళ్లుగా పరిష్కారం కాని సమస్య..

ధరణి పోర్టల్ అమలు తర్వాత మండలంలోని న్యూ కంజర్‌కు చెందిన 465 సర్వే నెంబర్లు, పొట్టపల్లి (బి)కి చెందిన 123 సర్వే నెంబర్లు, పొట్టపెల్లి (కే)కి చెందిన 40 సర్వే నెంబర్లు ప్రొహిబిటెడ్‌గా గుర్తించబడ్డాయి. మొత్తం 628 సర్వే నంబర్లు ప్రొహిబిటెడ్ జాబితాలో చేర్చారు. ఏళ్ల తరబడి పరిష్కరించడం లేదు. సమస్య పరిష్కారం కోసం రైతులు అధికారులు, ప్రజాప్రతినిధుల వద్దకు అనేకసార్లు వెళ్లినా ఫలితం లేకపోయింది. దీంతో భూముల క్రయవిక్రయాలు నిరవధికంగా నిలిచిపోయాయి. రైతులు ఇబ్బంది పడుతున్నారు.

ఇవీ సర్వే నంబర్లు..

గ్రామం	సర్వే నంబర్
న్యూ కంజర్	465
పొట్టపల్లి(బి)	123
పొట్టపెల్లి (కె)	40

భూ భారతితో చిగురించిన ఆశలు..

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ధరణి పోర్టల్‌ను రద్దు చేసి, భూ భారతి పోర్టల్‌ను ప్రవేశపెట్టింది. రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రకటించింది. ఈ ప్రకటనతో రైతులలో ఆశలు చిగురించాయి. భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ అధికారులతో సదస్సులు నిర్వహించారు. ఆగస్టు 15నాటికి అన్ని భూ సమస్యలు పరిష్కారమవుతాయని అధికారులు హామీ ఇచ్చారు. అయితే, ఈ మూడు గ్రామాల రైతుల సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు.

మంత్రులను కలిసినా ఫలితం లేదు..

ఈ మూడు గ్రామాల రైతులు తమ భూ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావును స్థానిక నాయకులతో కలిసి విన్నవించారు. అయినా సమస్య ఇప్పటికీ పరిష్కారం కాకపోవడంపై రైతులు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు తమ సమస్యను గుర్తించి, వెంటనే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా..



మా భూ సమస్య పరిష్కరించాలని ఐదేళ్లుగా ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నా. సమస్య పరిష్కారం కావడం లేదు. అసలు అవుతుందో లేదో అనే అనుమానం వస్తుంది.

– మంద సంజీవ్, రైతు న్యూకంజర్

ఇప్పుడైనా పరిష్కరించాలి



భూ సమస్య పరిష్కారానికి ఐదేళ్లుగా తిరగని ఆఫీసు లేదు. కలువని అధికారి లేదు. అయినా మా సమస్య పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ పరిష్కరించాలి.

– ఎస్‌కే.సలీమ్, రైతు న్యూకంజర్

భూ సమస్య పరిష్కరిస్తాం



లక్ష్మణచాంద మండలం న్యూకంజర్, పొట్టపెల్లి(కె), పొట్టపల్లి (బి) గ్రామాల 648 సర్వే నంబర్ల భూ సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాం. ప్రభుత్వం నుంచి వచ్చే సూచనలతో కలెక్టర్ ఆదేశాల మేరకు తగిన చర్యలు చేపడతాం. భూ భారతి ద్వారా అన్నదాతల సమస్య పరిష్కారం అయ్యేలా చర్యలు చేపడుతాం.

– కిశోర్‌కుమార్, అదనపు కలెక్టర్

అంగన్‌వాడీల నుంచి అక్రమ వసూళ్లు

- ఓ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే వ్యక్తి నిర్వాకం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే ప్రైవేట్ వ్యక్తి అక్రమ వసూళ్లకు తెరలేపాడు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగ విరమణ పొందిన టీచర్ల స్థానాల్లో అర్హులైన ఆయాలకు ఇటీవల పదోన్నతులు కల్పించారు. సదరు వ్యక్తి ముందుగానే అర్హుల జాబితాను అధికారుల వద్ద నుంచి ప్రజాప్రతినిధి పేరిట తీసుకున్నారు. వారితో మాట్లాడి పదోన్నతులు కల్పిస్తున్నట్లుగా తెలిపారు. ఇటీవల పలువురు ఆయాలకు టీచర్లుగా పదోన్నతులు లభించాయి. కొంతమందికి ఫోన్ చేసి ఐసీడీఎస్‌లోని ఓ అధికారికి డబ్బులు ఇవ్వాల్సి ఉందని వారి నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పుడు డబ్బులు ఇవ్వకపోతే భవిష్యత్తులో ఇతర పనులు ఉంటాయని బెదిరిస్తున్నాడు. ప్రజాప్రతినిధి వద్ద పనిచేసే వ్యక్తి కావడం, అధికారి పేరిట డబ్బులు డిమాండ్ చేయడంతో విధి లేని పరిస్థితుల్లో కొంతమంది కొంత నగదు ముట్టజెప్పినట్లుగా సమాచారం. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు ఆపై వారికి తోచినంత ఇవ్వాలని డిమాండ్ చేసినట్లుగా బాధిత అంగన్‌వాడీ టీచర్లు వాపోతున్నారు. ఈ విషయం బయటకు చెబితే తాము ఇబ్బంది పడాల్సి వస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారు. సమగ్రంగా విచారణ జరిపిస్తే అన్ని ఆధారాలు బయటపడి సదరు వ్యక్తి నిర్వాకం వెల్లడయ్యే అవకాశముంది. కాగా, ఈ విషయమై జిల్లా సంక్షేమాధికారి మిల్కాను వివరణ కోరగా ఎవరికి డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు డిమాండ్ చేసినట్లయితే తమ దృష్టికి తీసుకురావడంతోపాటు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రితోపాటు ఇద్దరు పిల్లలు తీవ్రంగా గాయపడ్డారు. శివాజీచౌక్‌కు చెందిన బారడి రవికాంత్ తన ఇద్దరు పిల్లలను ఉదయం పాఠశాలలో వదిలిపెట్టేందుకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈక్రమంలో ఎదురుగా మరో వ్యక్తి బైక్‌పై అతివేగంతో వచ్చి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రవికాంత్‌తోపాటు ఆయన పిల్లలకు గాయాలయ్యాయి. స్థానికులు వారిని ఆసుపత్రికి తరలించారు. బైక్ ఢీకొట్టిన వ్యక్తి పరారయ్యాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు.

ఇచ్చోడ ఎంఈవోకు షోకాజు నోటీసు

- రాగి జావ సరఫరాలో నిర్లక్ష్యంపై కలెక్టర్ ఆగ్రహం


MEMO

డీఈవో జారీ చేసిన షోకాజు నోటీసు

ఆదిలాబాద్‌టౌన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఇచ్చోడ ఎంఈవోపై కలెక్టర్ రాజర్షి షా ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమ నిర్వహణపై ఎంఈవోలు, నోడల్ ఉపాధ్యాయులు, స్టూడెంట్ చాంపియన్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాగిజావ తాగుతున్నారా.. రుచి ఎలా ఉంది అంటూ కలెక్టర్ విద్యార్థులను అడిగారు. దీంతో ఇచ్చోడ మండలంలోని ఉర్దూ మీడియం పాఠశాల విద్యార్థులు మాట్లాడుతూ తమకు రాగి జావ ఇవ్వడం లేదని వివరించారు. ఎంఈవో, ఉర్దూ పాఠశాలలో రెగ్యులర్ హెచ్‌ఎంగా పనిచేస్తూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై కలెక్టర్ సీరియస్ అయ్యారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈవోను ఆదేశించారు. సదరు ఎంఈవో కాసావాత్ బిక్కుకు షోకాజు నోటీసు జారీ చేస్తూ డీఈవో ఖుష్బూగుప్తా శనివారం ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఒక్కరోజులోగా వివరణ ఇవ్వాలని సూచించారు. ఆయన ఇచ్చే వివరణ ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లుగా ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

పైపు లైన్‌కు భారీ లీకేజీలు

- ఎస్సారెస్పీ కాలనీ రోడ్లపై భారీగా ప్రవహిస్తున్న నీరు
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు



ప్రాజెక్ట్ కాలనీలో గల్లీ రోడ్లపై ప్రవహిస్తున్న నీరు



ఎస్సారెస్పీలో లీకేజీ అవుతున్న నీరు

బాల్కొండ: మెండోరా మండలంలోని శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ కాలనీకి ప్రాజెక్ట్ నుంచి నీటి సరఫరా చేసే పైపులైన్‌కు భారీ లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో లీకేజీ నీరు కాలనీ రోడ్లపై కుంటల్లా నిలుస్తోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్ట్ నుంచి కాలనీకి నీటి సరఫరా కోసం ప్రాజెక్ట్ నిర్మాణ కాలంలో పైపు లైన్ వేశారు. ఆ పైపులు మట్టి సిమెంట్‌పైపు కావడంతో లీకేజీలకు మరమ్మతులు చేపట్టడం లేదు. దీంతో లీకేజీ నీరు అధికంగా పోతోంది. పైపులైన్, సీసీ రోడ్ల మరమ్మతులను ప్రాజెక్ట్ అధికారులు గ్రామ పంచాయతీకి అప్పగించారు. కానీ ప్రస్తుతం ప్రాజెక్ట్, జీపీ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలోనే ఈ పనులను జీపీకి అప్పగించామంటూ ప్రాజెక్ట్ అధికారులు చెప్పారు. కానీ మా వద్ద మరమ్మతులకు నిధులు లేవంటు జీపీ అధికారులు పేర్కొంటున్నారు. పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు. పైపు లైన్ మరమ్మతులకు కోసం తవ్విన గుంతల వల్ల ప్రమాదాలు జరిగే ప్రమాదం కూడా ఉంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

జీపీ నుంచి మరమ్మతులు చేపట్టాలి

పోచంపాడ్ జీపీకి 2019లోనే నీటి నిర్వహణను అప్పగించాం. ప్రస్తుతం జీపీ అధికారులు తమకు సంబంధం లేదంటున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నిబంధనల ప్రకారం గ్రామ పంచాయతీ నుంచి మరమ్మతులు చేపట్టాలి. – అక్తర్, ఏఈఈ, ఎస్సారెస్పీ

అధికారికంగా అప్పగించలేదు

ప్రాజెక్ట్ కార్యాలయానికి సంబంధించిన పైపులైన్‌ను అధికారికంగా గ్రామ పంచాయతీకి అప్పగించ లేదు. సమస్యను ఉన్నతాధికారులకు విన్నవించాను. ఉన్నత అధికారుల మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకుంటాం.

– భోజన్న, పంచాయతీ కార్యదర్శి, పోచంపాడ్

ఎమ్‌హెల్‌హెచ్‌పీలకు సర్టిఫికెట్ల అందజేత

నిజామాబాద్‌నాగారం: ఇటీవల కాంట్రాక్టు పద్ధతిలో విధుల్లో చేరిన ఎమ్‌ఎల్‌హెచ్‌పీ(మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్)లు మూడు నెలల శిక్షణ పూర్తి చేసినందుకు శనివారం డీఎంహెచ్‌వో రాజశ్రీ వారికి సర్టిఫికేట్లు అందజేశారు. ఈసందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ.. శిక్షణ కాలం పూర్తయిన తర్వాత నిర్వహించిన మౌఖిక పరీక్షల్లో వారు ప్రదర్శించిన ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయించినట్లు తెలిపారు. దీనికి గానూ ఎక్స్‌టర్నల్ ఎగ్జామినర్‌గా నిరూప్‌రెడ్డి, ప్రోగ్రామ్ అధికారి రవి విధులు నిర్వహించారు. మొత్తం 10 మంది హాజరయ్యారు.



అర్ధంతరంగా నిలిచిన పాఠశాల భవనాలు



హాజీపూర్‌లో నిలిచిన తరగతి గదుల నిర్మాణం



రాముల గుట్ట తండాలో వరండాలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

- ఒకే గదిలో అయిదు తరగతుల నిర్వహణ
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- హాజీపూర్, లింగంపల్లి తండాలలో నిధులు లేక నిలిచిన భవన నిర్మాణాలు

నస్రుల్లాబాద్: విద్యార్థులకు కనీసం కూర్చోవడానికి గదులు లేని పరిస్థితి ప్రభుత్వ పాఠశాలల్లో ఉంది. నస్రుల్లాబాద్ మండలంలోని హాజీపూర్, లింగంపల్లి గ్రామాల్లో కేవలం ఒక గది మాత్రమే ఉండటంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిన్నారులకు సరిపడా గదులు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టారు కాని బిల్లులు మంజూరు కాకపోవడంతో అర్ధంతరంగా నిలిచి పోయాయి. దీంతో ఒకే గదిలో 5 తరగతులకు చదువులు చెబుతున్నారు.

వరండాలో బోధన..

రాములుగుట్ట తండాల్లో చిన్నారులకు కేవలం ఒక గది మాత్రమే ఉండటంతో వరండాలో తరగతులను నిర్వహిస్తున్నారు. ఒకే గదిలో ఐదు తరగతుల విద్యార్థులు గుంపులుగా కూర్చొని చదువుకుంటున్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలను అందించినా కూడా అనుకున్న సంఖ్యలో విద్యార్థులు రావటం లేదు. దీనికి కారణం ఒకే గదిలో అందరికీ పాఠాలు చెప్పడమే. ఉన్నాతాధికారులు స్పందించి అదనపు తరగతి గదులను నిర్మాణం చేపట్టి చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించాలి.





జిల్లాకేంద్రంలోని బస్టాండ్‌లో బస్సు వద్ద గుమిగూడిన ప్రయాణికులు.. బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



బస్సు కిటికీ నుంచి ఎక్కుతున్న యువకుడు

సందడిగా నగర బస్టాండ్

జిల్లాకేంద్రంలోని బస్టాండ్ శనివారం ప్రయాణికులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలలోని విద్యార్థులు తమ ఇళ్లకు వెళ్లడానికి బస్సుల కోసం నగరంలోని బస్టాండ్‌కు భారీగా వచ్చారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, నిజామాబాద్





బస్టాండ్‌కు వస్తున్న విద్యార్థులు

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌బీఐ డీజీఎం ఒమెన్

డిచ్‌పల్లి: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీఎం సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ హైదరాబాద్ హెడ్ ఆఫీస్ డీజీఎం (ఎల్‌హెచ్‌వో సీసీవో) ఎంపీ ఓమెన్ సూచించారు. డిచ్‌పల్లి ఖిల్లా గ్రామంలో శనివారం ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పీఎం జన్‌ధన్ ఖాతాలు, సాధారణ ఖాతాలు కలిగి ఉన్న ఖాతాదారులకు ప్రమాద బీమా, సాధారణ బీమా యోజన పథకాలపై ప్రతి గ్రామ పంచాయతీలో అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. కేవలం రూ.20తో రూ.2లక్షల ప్రమాద బీమా, రూ.436తో రూ.2లక్షల సాధారణ బీమా సౌకర్యం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటి వరకు బీమా యోజన పథకంలో చేరని వారుంటే వెంటనే పథకంలో చేరాలని సూచించారు. అలాగే చాలా కాలంగా లావాదేవీలు జరపకుండా ఉండే ఖాతాలు పనిచేయవని, వెంటనే వారు ఆధార్‌కార్డు, పాన్ కార్డులు బ్రాంచ్‌లో అందజేసి కేవైసీ పరిశీలన పూర్తి చేస్తే తిరిగి ఖాతా ద్వారా లావాదేవీలు జరుపవచ్చన్నారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ (నిజామాబాద్) కొల్లేటి మహేశ్వర్, నిజామాబాద్ ఏజీఎం (ఏవో) రంజిత్‌నాయుడు, చీఫ్ మేనేజర్ (ఏవో) రవికుమార్, ఆర్‌ఎస్‌ఈటీఐ డైరక్టర్ రవి, డిచ్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ నిఖిత, సిబ్బంది, మాజీ సర్పంచ్ బూస సుదర్శన్, ఖిల్లా రామాలయ కమిటీ చైర్మన్ జంగం శాంతయ్య, వీడీసీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ పరీక్ష



పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ పరీక్షకు హాజరైన అభ్యర్థులు

నిజామాబాద్‌నాగారం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో వైర్‌మన్ అర్హతకు సంబంధించి జిల్లా వైర్‌మెన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వైశాక్షి సంతోష్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఎలక్ట్రిషన్ వైర్‌మన్ పర్మిట్ కలిగి ఉండాలన్నారు. ఈ సర్టిఫికెట్ ఉంటేనే ఎలక్ట్రికల్ వర్క్ చేయాలన్నారు. ప్రమాదాలను అరికట్టాలంటే పర్మిట్ ఉన్న ఎలక్ట్రిషన్‌లతోనే వర్క్ చేయించాలన్నారు. వైర్‌మన్ ఎగ్జామ్ రాసి పాస్ కావాలని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు రమేశ్, రాజు, అత్తర్, రఫీక్, మహమూద్ పాల్గొన్నారు.

జర్నలిజం కోర్సుల్లో అడ్మిషన్లు

నిజామాబాద్‌అర్బన్: జర్నలిజం కోర్సులలో అడ్మిషన్ల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని రచన జర్నలిజం కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. కరస్పాండెంట్ విధానం ద్వార జర్నలిజంలో పీజీ డిప్లొమా, సర్టిఫికెట్ కోర్సులలో ప్రవేశం పొందవచ్చన్నారు. ఈ కోర్సులకు పదో తరగతి చదివిన వారు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 30లోపు దరఖాస్తులు చేసుకోవలన్నారు. కేశవ్ మెమోరియల్ ఎడ్యుకేషన్ క్యాంపస్, నారాయణగూడ, హైదరాబాద్‌లో సంప్రదించాలన్నారు. లేదా 9959640797ను సంప్రదించలన్నారు.

సోలార్ ప్లాంట్స్‌పై సబ్సిడీని సద్వినియోగం చేసుకోవాలి



నిజామాబాద్ సిటీ: ఇళ్లపై సోలార్ ప్లాంట్స్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సబ్సిడీని ఇస్తుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఎస్ఈ రవీందర్ అన్నారు. నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నగరంలో డిస్కం ఇంజినీర్లకు ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. శిక్షణలో పాల్గొన్న ఇంజినీర్లకు ఏఈలకు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఈ మాట్లాడుతూ.. సోలార్ ప్యానల్స్‌తో విద్యుత్ ఉత్పత్తి చేస్తే కిలోవాట్‌కు 85 కిలోల కార్బన్ మోనాక్సైడ్ వాతావరణంలోకి వెళ్లకుండా చేయగలుగుతామన్నారు. రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడం మూలంగా లైన్ లాసెస్‌ని తగ్గించుకోవచ్చన్నారు. కోటి గృహాలపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్స్ ఏర్పాటు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ఒక్క కిలోవాట్‌కు రూ. 30వేల సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. 3 కిలోవాట్లకంటే ఎక్కువ వాటికి రూ. 78వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీని వినియోగించుకొని రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్స్‌ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ భారతి, రిటైర్డు అధికారి దుర్గాప్రసాద్, నరేంద్ర కుమార్, అధికారులు వెంకటసుబ్బయ్య, అల్జాపూర్ రమేష్, పోశెట్టి, నరేంద్ర కుమార్ పాల్గొన్నారు.